క్లుప్తంగా

బీసీ హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ



వార్డెన్‌కు ఫ్యాన్లను అందజేస్తున్న డాక్టర్ బి.శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని డాక్టర్స్ కాలనీలో ఉన్న బీసీ హాస్టల్‌కు సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ ఫ్యాన్లను వితరణగా ఇచ్చారు. బుధవారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో ఫ్యాన్లను హాస్టల్ వార్డెన్ రమేష్‌కు అందజేశారు. హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని వార్డెన్ కోరగా ఆయన ఫ్యాన్లను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.శంకరశర్మ మాట్లాడుతూ.. ధనవంతులు పేదవారికి సహాయం చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్యార్థులకు సాయం చేయడం వల్ల భవిష్యత్‌లో వారు ఇతరులకు సాయం చేస్తారన్నారు.

హెడ్‌నర్స్ సేవలు ఆదర్శనీయం



వసంతకుమారిని సన్మానిస్తున్న కార్డియాలజీ విభాగ వైద్యులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగంలో హెడ్ నర్సుగా పనిచేస్తున్న ఎస్.వసంత కుమారి సేవలు ఆదర్శనీయమని ఆ విభాగం వైద్యులు కొనియాడారు. వసంత కుమారి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని బుధవారం ఆమెను కార్డియాలజీ విభాగంలో సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. వసంత కుమారి తన 38 ఏళ్ల సర్వీసులో కార్డియాలజీ విభాగంలోనే 30 ఏళ్లు పని చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్డియాలజీ విభాగ వైద్యులు ప్రశాంత్, కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్‌కుమార్, మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పంపు పనుల పరిశీలన



జొహరాపురం వద్ద పెట్రోల్ పంపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని 19వ వార్డు జొహరాపురం రోడ్డులో నగరపాలక సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం పెట్రోల్ బంకు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పెట్రోల్ పంపు ఏర్పాటుకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. వచ్చే వారంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు డీఈఈ నరేష్ పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం



దాడిలో గాయపడిన కురువ నాగులు

కర్నూలు రూరల్: మండల పరిధిలోని నిడ్జూరు గ్రామం బీసీ కాలనీలో నివసిస్తున్న కురువ నాగులుపై అదే గ్రామానికి చెందిన కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి భార్య శివలక్ష్మి తెలిపిన వివరాలు.. కురువ నాగులు బుధవారం సాయంత్రం తన కుమార్తెతో కలిసి బైక్‌పై ఇంటికి వస్తుండగా కరెంట్ డిపో ప్రాంతంలో తన వైపు ఎందుకు చూస్తున్నావంటూ అదే గ్రామానికి చెందిన లాలూ వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో లాలూతోపాటు అతని సోదరులు కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. సమీపంలో ఉన్న నాగులు భార్య శివలక్ష్మి, అతని మామ అడ్డురాగా వారిపై కూడా దాడి చేశారు. నాగులు గాయపడి స్పృహ తప్పి పడిపోగా స్థానికులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : కింగ్‌డమ్, హరి హర వీరమల్లు, మహావతార్ నరసింహ, జూనియర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్: కింగ్‌డమ్, హరి హర వీరమల్లు, జూనియర్, మహావతార్ నరసింహ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: కింగ్‌డమ్, సయ్యారా, హరిహర వీరమల్లు
శ్రీరామ : పోలీస్ వారి హెచ్చరిక
రాజ్ : హరిహర వీరమల్లు
భరత్ కాంప్లెక్స్ : వెంకి (2004)
విజయ : కింగ్‌డమ్
విక్టరీ : తమ్ముడు

గిరిజనుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(అర్బన్): గిరిజనుల అభ్యున్నతికి ఆది కర్మయోగి అభియాన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆది కర్మయోగి అభియాన్ పథకం అమలుపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీడీఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గిరిజనులు, సంచార జాతుల వారి అభ్యున్నతి కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 35 వేల మంది గిరిజనులు ఉన్నారని, వీరికి అన్ని పథకాలు, సేవలు సంతృప్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, రోడ్లు, తాగునీరు, ఆటవీ, గృహాలు, మహిళా శిశు సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వీటితో పాటు సర్వీస్ డెలివరీకి సంబంధించి ఆధార్ లేని వారికి ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించడంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించాలన్నారు. అలాగే పెన్షన్లు, రుణ సౌకర్యాలు, ఇతర జీవనోపాధులు కల్పించడంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో గిరిజనులకు ప్రభుత్వ పరంగా చేయాల్సిన అవసరాలు ఏమి ఉన్నాయో ముందుగానే గుర్తించి వాటిని అందించే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ముఖ్యమైన ప్రభుత్వ విభాగాల నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఆది కర్మయోగి, సహ యోగిలను గుర్తించి వీరికి శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్స్ ద్వారా గిరిజనుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు.

బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలి

జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎంపీడీఓలను ఆదేశించారు. పేద కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చే వారిని గుర్తించి మార్గదర్శకులుగా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన మండలాల వారీగా ఎంపీడీఓలతో మాట్లాడి పురోగతిని తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ జీ.నాసరరెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కొండయ్య, సీపీఓ హిమప్రభాకర్‌రాజు, డ్వామా పీడీ రమణయ్య, డీఈఓ శామ్యూల్‌పాల్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ నిర్మల, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, పశు సంవర్ధకశాఖ జేడీ శ్రీనివాసులు, పీఆర్ ఈఈ మద్దన్న తదితరులు పాల్గొన్నారు.

●యూరియా సక్రమంగా పంపిణీ చేయండి

కర్నూలు(హాస్పిటల్): యూరియా పంపిణీలో సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయం నుంచి పీ-4 పాలసీ, తల్లికి వందనం, హౌసింగ్, ఉపాధి హామీ, తాగునీరు, పీజీఆర్ఎస్, యూరియా లభ్యత తదితర అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం 563 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఆగస్టు 1న 2,500 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని, ఇందులో ఎక్కువ శాతం రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్‌లలో అందుబాటులో ఉంచాలని సూచించారు. సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు ప్రతి షాపును తనిఖీ చేయాలని ఆదేశించారు. యూరియా పంపిణీలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. అలాగే పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన సమస్యలను గడువులోగా పరిష్కరించాలన్నారు. 85 శాతం భూసమస్యలే వస్తున్నాయని, డీఆర్ఓ, సబ్ కలెక్టర్, ఆర్డీఓలు ఈ అంశంపై రెగ్యులర్‌గా సమీక్షించాలన్నారు. ప్రొసీజర్ ప్రకారం అర్జీ పరిష్కరించకుండా ఒకే అర్జీ రెండు, మూడు సార్లు వస్తే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోందని, నెగిటివ్ ఫీడ్ బ్యాక్ నిజమని తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. నిధుల అంశంలో డీపీఓ, జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సమన్వయంతో అందుబాటులో ఉన్న నిధులతో మరమ్మతులు చేయించాలని, బడ్జెట్ సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ట్యాంకులను శుభ్రం చేయించాలని, పారిశుద్ధ్య డ్రైవ్ చేయించాలని, స్ప్రేయింగ్ కార్యక్రమాలు జరగాలని చెప్పారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, డీఎఫ్ఓ శ్యామల, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

●ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ పూర్తి చేయండి

కర్నూలు(హాస్పిటల్): అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులు త్వరలో మంజూరు చేయనున్న నేపథ్యంలో ఈనెల 31వ తేదీ సాయంత్రంలోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. ఆయన బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కానీ రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలన్నారు. కొతాళం - 258, హాలహర్వి - 195, చిప్పగిరి - 182, పత్తికొండ - 180, ఆలూరు - 172 మంది రైతులకు ఈ-కేవైసీ లింక్ పెండింగ్‌లో ఉండటంపై కారణాలను ఆరా తీశారు. వ్యవసాయ అధికారులు స్పందిస్తూ.. పెండింగ్‌లో ఉన్న వారిలో కొందరు ఇతర నగరాల్లో, పట్టణాల్లో ఉన్నారని, కొందరు మరణించారని వివరించారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్పీసీఐ మ్యాపింగ్ కాని రైతులు 8,755 మంది ఉన్నారని, ఆదోని సబ్‌కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వీటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కాని రైతుల అకౌంట్లను ఆధార్ మ్యాపింగ్ చేసే విధంగా బ్యాంకు అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కాని రైతులు రైతు సేవా కేంద్రాలు, మీ సేవా కేంద్రాలు, సచివాలయాలకు వెళ్లి ప్రక్రియ పూర్తి చేయించుకోవాలన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఎల్‌డీఎం రామచంద్రరావు, మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

హ్యూమన్ ట్రాఫికింగ్‌ను అంతమొందించాలి

కర్నూలు (న్యూటౌన్): హ్యూమన్ ట్రాఫికింగ్‌కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కర్నూలు జిల్లా బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ జుబైదాబేగం పిలుపునిచ్చారు. వరల్డ్ డే అగినెస్ట్ ట్రాఫికింగ్ సందర్భంగా కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌లో 'యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్' ప్రాజెక్టు కింద కోనేర్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను పూర్తిగా అంతమొందించేందుకు ఐక్యంగా పనిచేయాలన్నారు. కర్నూలు రైల్వేస్టేషన్ మాస్టర్ శేషపాణి, ఆర్పీఎఫ్ సీఐ రామ్మోహన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్లలో బహిరంగ ప్రదేశాల్లో ట్రాఫికింగ్ ఎక్కువగా జరుగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల సమాచారం 139, 1098, 100 నంబర్లకు తెలిజేయవచ్చన్నారు. యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ మౌనిక మాట్లాడుతూ.. ఈ ఏడాది థీమ్ మానవ అక్రమ రవాణా ఒక సంఘటిత నేరం, దౌర్జన్యాన్ని ముగించాలన్నారు. కర్నూలు జిల్లా ట్రాఫికింగ్ నుంచి పూర్తిగా విముక్తి పొందే దిశగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందడుగు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. సీడబ్ల్యూసీ మెంబర్ మధుసుధాకర్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మున్నాజీరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శేషన్న, సమీర్, జీఆర్‌పీ రైటర్ మాధవ్‌స్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఇన్‌చార్జ్ సుంకన్న, డీసీపీయూ సభ్యులు నాగేశ్వరరావు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నియామకం

కర్నూలు కల్చరల్: యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా నాగమధు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్ఎస్‌యూఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నాగమధుకు యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. నాగమధు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా నియమించారని పేర్కొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని - జిల్లా వైద్య నోడల్ అధికారి రఘు సూచించారు. మండల పరిధిలో సూదిరెడ్డి పల్లె గ్రామంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు ఆయన సూచించారు. వర్షాకాలం కావడంతో నీరు కలుషితమై డయేరియా వ్యాధి బారిన పడే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు కాచి, వడబోసి, చల్లార్చుకుని తాగాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అబ్దుల్ అనీద్, సామాజిక ఆరోగ్య అధికారి జయ నాగమణి, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శబ్ధ కాలుష్య నివారణకు స్పెషల్ డ్రైవ్



అధిక శబ్దాలు చేసే హారన్లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: ట్రాఫిక్‌లో శబ్ధ కాలుష్య నివారణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కర్నూలు నగరంలో సుమారుగా 25 వేలకు పైగా ఆటోలు తిరుగుతున్నాయి. అధిక శబ్దాలనిచ్చే హారన్లను బిగించుకుని వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు బృందాలుగా ఏర్పడి ప్రధాన రహదారుల్లోని ముఖ్య కూడళ్లు రాజ్‌విహార్, సి.క్యాంప్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆటోలకు బిగించిన 350 హారన్లను తొలగించి సీజ్ చేశారు. మళ్లీ వాటిని బిగించి శబ్ధ కాలుష్యానికి పాల్పడితే భవిష్యత్తులో ఆటోలను సీజ్ చేస్తామని డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు. ట్రాఫిక్ ఎస్ఐలు వెంకటేశ్వర్లు, హుసేన్, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

ఉస్మానియా విద్యార్థికి వెండి పతకం



క్రీడాకారుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ సమీయుద్దీన్

కర్నూలు (టౌన్): విజయవాడ పట్టణంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉస్మానియా కళాశాల బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎస్.ఆరిఫ్ వెండి పతకం సాధించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థిని బుధవారం కళాశాలలోని తన చాంబర్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ సమీయుద్దీన్ అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో పతకం సాధించిన తమ కళాశాల విద్యార్థి వచ్చే నెల 19, 20 తేదీల్లో కలకత్తా పట్టణంలో నిర్వహించనున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననుడటం సంతోషించదగ్గ విషయమన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఆగస్టు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న జి.హృదయరాజు

కర్నూలు సిటీ: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఆగస్టు 2న ధర్నాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఫ్యాప్టో కో-చైర్మన్, జిల్లా కమిటీ ఇన్‌చార్జి కాకి ప్రకాష్ రావు, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజులు తెలిపారు. బుధవారం సలాంఖాన్ భవనంలో ఫ్యాప్టో ధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పెండింగ్ బకాయిలు చెల్లించాలని, కొత్తగా పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలలైనా ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం లేకుండాపోతోందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేసేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సేవాలాల్ నాయక్(ఆప్టా), సెక్రటరీ జనరల్ జి.భాస్కర్(బీ.టీ.ఏ), యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం, ఆప్టా జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇకపై వేర్వేరు ఎన్జీఓ కార్యవర్గాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీఎన్జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన దాదాపు 20 ఏళ్లుగా అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జిల్లా ట్రెజరీలో సీనియర్ అకౌంటెంట్‌గా ఉన్న వెంగళ్‌రెడ్డి గురువారం పదవీ విరమణ చేయనున్నారు. కొన్నేళ్ల క్రితమే ఎస్టీఓగా పదోన్నతి లభించినప్పటికీ తీసుకోకుండా సీనియర్ అకౌంటెంటుగానే కొనసాగుతున్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం జరుగనుంది. ఆగస్టు 12న అసోసియేషన్ తరుపున సన్మాన కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎన్జీఓ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, రమణ తదితరులు హాజరు కానున్నారు. ఎన్జీఓ అసోషియేషన్ అధ్యక్షుడిగా పదవీ కాలం ఈ నెల 10వ తేదీతో ముగిసింది. ఇకపై కర్నూలు, నంద్యాల జిల్లాలకు వేర్వేరు కార్యవర్గాలు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతానికి రాష్ట్ర సంఘం రెండు జిల్లాలకు అడ్‌హాక్ కమిటీలకు వేసే అవకాశం ఉంది. ఆగస్టు 12న జరిగే కార్యక్రమంలో రెండు జిల్లాలకు రాష్ట్ర సంఘం నేతలు అడ్‌హాక్ కమిటీలను ప్రకటించనున్నారు. సెప్టెంబరు నెలలో పూర్తి స్థాయి కార్యవర్గాల ఏర్పాటుకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. 20 ఏళ్లు ఎన్జీఓ అసోషియేషన్ అధ్యక్షుడిగా ఎదురు లేకుండా కొనసాగిన ఆయన్ను పదవీ విరమణ వేళ విమర్శలు, ఆరోపణలు చుట్టుముట్టాయి. విచారణ కూడా ఎదుర్కొంటున్నారు. అయితే తనపై అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే ఎటువంటి చర్యలకైన సిద్ధమేనని ఆయన ప్రకటించారు.

అధ్వానంగా సంక్షేమ హాస్టళ్లు

కల్లూరు: కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జి. మణిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆ విభాగం కల్లూరు కమిటీ నాయకుల ఆధ్వర్యంలో పెద్దపాడు గ్రామంలో ఉన్న బీసీ హాస్టల్ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న సమస్యలు పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఆవరణలో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయని, తాగునీరు, ఫ్యాన్లు తదితరవి లేవని విద్యార్థులు వాపోయారు. అనంతరం మణిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి కిట్‌లో ఇచ్చిన బ్యాగుల నాణ్యత లేకపోవడంతో చిరిగిపోతున్నాయన్నారు. హాస్టల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి త్వరలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు బి. మధుమోహన్, నాయకులు హేమంత్, దీపు, అమీర్, కృష్ణ, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా వ్యవస్థీకృత నేరం

కర్నూలు: మానవ అక్రమ రవాణా వ్యవస్థీకృత నేరమని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవా సదన్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. జడ్జి లీలా వెంకట శేషాద్రి హాజరై మానవ అక్రమ రవాణాకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మానవ అక్రమ రవాణా అత్యంత దుర్మార్గమైన హక్కుల ఉల్లంఘన అని తెలియజేశారు. ప్రధానంగా లైంగిక దోపిడీ, వెట్టి చాకిరీ, బానిసత్వం రూపాల్లో ఉంటుందన్నారు. దీనికి ప్రధాన కారణాలు పేదరికం, సరైన విద్య లేకపోవడం, ఉపాధి అవకాశాలు లేకపోవడం, అక్రమ మార్గంలో డబ్బు త్వరగా సంపాదించాలనే ఆలోచన ధోరణితో మానవ అక్రమ రవాణాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం జులై 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా శిశు సంరక్షణ అధికారి నిర్మల, మహిళా పీఎస్ సీఐ విజయలక్ష్మి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ శివరామ చంద్రరావు, సులోచన, న్యాయవాది ఆశాబాయి, పారా లీగల్ వలంటీర్స్, ఎన్జీఓలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆధార్ కార్డుల జారీ

జిల్లా జడ్జి కబర్ధి ఆదేశాల మేరకు అనాథ పిల్లలకు ఆధార్ కార్డు జారీ చేసే ప్రక్రియను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి ప్రారంభించారు. బంగారుపేట సచివాలయంలో బుధవారం లీలా వెంకటశేషాద్రి ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల, జిల్లా సచివాలయం ఆధార్ ఇన్‌చార్జ్ శంకర్ రెడ్డి బృందం సహకారంతో బంగారుపేటలోని అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు.

సీపీఐ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలో ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ కర్నూలు జిల్లా 24వ మహాసభల పోస్టర్లను బుధవారం సీఆర్ భవన్‌లో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం పేద, మధ్య తరగతి ప్రజల పక్షాన పోరాటాలు చేశామన్నారు. ఆగస్టు 9, 10, 11 తేదీల్లో కర్నూలు నగరంలో జిల్లా 24వ మహాసహాసభలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశం జిల్లా సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించడానికి చర్చా వేదిక కానుందన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, మహేష్, నగర కార్యవర్గ సభ్యులు వెంకటేష్, బీసన్న, కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి భారతి తదితరులు పాల్గొన్నారు.

అవి-ఇవి

2న నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): ఆగస్టు 2న నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో 19 అజెండా అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని కమిషనర్ వెల్లడించారు.

11న యోగా టోర్నమెంట్

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని యోగా హాలులో ఆగస్టు 11న జిల్లా స్థాయి యోగా టోర్నమెంటు కమ్ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్ శెట్టి, మునిస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో 8 నుంచి 45 ఏళ్ల బాలబాలికలు, స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు చివరి వారంలో పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించనున్న 50వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, సీనియర్స్ బాలబాలికల యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 77320 89440 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అన్న క్యాంటీన్ల తనిఖీ

కర్నూలు (టౌన్): అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాలు వేడిగా, రుచిగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా క్యాంటీన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి తనిఖీ చేశారు. భోజనం చేస్తున్న వారితో కలెక్టర్ మాట్లాడారు. భోజనం ఎలా ఉందని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్‌లో మంచి భోజనం అందించాలన్నారు. శుచి, శుభ్రత పాటించాలని, సకాలంలో భోజనం అందించాలన్నారు. భోజనం చేసేందుకు టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సమీపంలోని పూల అంగళ్లను పరిశీలించారు.

హ్యూమన్ ట్రాఫికింగ్ చట్టరీత్యా నేరం

కర్నూలు(హాస్పిటల్): మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు ఎ.దామోదర్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ ఎస్.మునీర్ అన్నారు. వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం కర్నూలు నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా కేవలం ఒక సామాజిక సమస్యే గాక వ్యవస్థీకృత, వ్యవస్థాగత నేరమన్నారు. కఠినమైన చట్టాలు అమలు చేయడం, నిఘా ఆధారిత దర్యాప్తులు నిర్వహించడం, అక్రమ రవాణాదారులను త్వరగా అరెస్టు చేయడం అవసరమని చెప్పారు. ఈ నేరాన్ని ఎదుర్కోవడానికి బాధితులు, సమాజంలోని ప్రతి పౌరుడు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.